క్లుప్తంగా

రూ.40 లక్షలతో బీటీరోడ్డు



బస్టాండ్ నుంచి అమ్మవారి గుడివరకు నిర్మించిన బీటీరోడ్డు

సీతానగరం: మండలంలోని కృష్ణారాయపురంలో అమ్మవారి గుడి నుంచి బస్టాప్ వరకు రూ.40 లక్షలతో బీటీరోడ్డు నిర్మాణం చేపట్టారు. ఇదివరకు మట్టిరోడ్డు ఉండటంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడేవారు. 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా సమస్యను ఎమ్మెల్యే జోగారావు దృష్టికి గ్రామస్తులు తీసుకువెళ్లారు. ఆయన వెంటనే స్పందించి జీజీఎంపీ నిధులు రూ.40 లక్షలు మంజూరు చేశారు. ఆ నిధులతో అమ్మవారి ఆలయం నుంచి బస్టాప్ వరకు బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ముగిసిన లక్ష్మీనృసింహస్వామి ఆలయ వార్షికోత్సవం



పూజలందుకుంటున్న లక్ష్మీనృసింహస్వామి

సీతానగరం: మండల కేంద్రంలోని సువర్ణముఖీ నదీ తీరాన వెలసిన వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న లక్ష్మీనృసింహస్వామి ఆలయ వార్షిక మహోత్సవాలు మంగళవారం ముగిశాయి. ఆలయ ప్రధాన అర్చకులు పీసపాటి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో మూడురోజుల పాటు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చివరిరోజు స్వామివారి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నసంతర్పణ చేశారు. పరిసర గ్రామాల నుంచి వందలాది మంది భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నిబంధనల ప్రకారం పనులు చేపట్టాలి



ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

బలిజిపేట: ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉపాధి పనులు చేపట్టాలని ఎంపీడీఓ రమేష్ నాయుడు అన్నారు. మండలంలోని సుభద్రలో చేపడుతున్న ఉపాధి పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. రెండు పూటలా పనులు చేయాలని, ఎండ తీవ్రత పెరుగుతున్నందున వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పని ప్రదేశంలో తాగునీరు, నీడ, ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉండేలా చూడాలని ఫీల్డ్ అసిస్టెంట్‌కు సూచించారు. జాబ్‌కార్డు ఉన్నవారికే పనులు కల్పించాలన్నారు. నిర్దేశిత కొలతల మేరకు పనులు చేసినట్లయితే గరిష్ఠ వేతనం వస్తుందన్నారు. ఏపీఓ కేశవరావు ఉన్నారు.

వలంటీర్ల రాజీనామా



ఎంపీడీఓకు రాజీనామా పత్రాలు అందచేస్తున్న కాశీపేట వలంటీర్లు

సీతానగరం: మండలంలో కాశీపేట గ్రామ సచివాలయం పరిధిలో సేవలందించిన ఏడుగురు వలంటీర్లు మంగళవారం తమ ఉద్యోగానికి రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను సంబంధిత అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నామమాత్రపు గౌరవ వేతనంతో ప్రజలకు నిస్వార్థంగా సేవలందిస్తున్న తమను ప్రతిపక్ష నేతలు కించపరిచేలా మాట్లాడుతున్నారని వాపోయారు. దీనికి నిరసనగా రాజీనామా చేసినట్లు చెప్పారు. తమకు వలంటీర్లుగా అవకాశం కల్పించిన జగనన్నకు మద్దతుగా ఎన్నికల ప్రచారంలో పాల్గొనున్నట్లు చెప్పారు.

దరఖాస్తుల ఆహ్వానం

సీతంపేట: స్థానిక బాలురు, బాలికల గిరిజన గురుకుల జూనియర్ కళాశాలల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు నోడల్ ప్రిన్సిపాల్ పైడి నాగభూషణరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ, వొకేషనల్ గ్రూపులకు ఆన్‌లైన్‌లో వచ్చే నెల 15లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. 2024 ఎస్ఎస్‌సీ పాసైన గిరిజన, గిరిజనేతర విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

బీఎల్ఓలు అందుబాటులో ఉండాలి

పాలకొండ: బీఎల్ఓలు పోలింగ్ కేంద్రాల వద్ద అందుబాటులో ఉండాలని తహసీల్దార్ వరహాలు సూచించారు. మండలంలోని కొండాపురం గ్రామంలో పోలింగ్ కేంద్రాలను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలకు సెలవుల నేపథ్యంలో పాఠశాలల తాళాలు బీఎల్ఓలు తమ వద్ద ఉంచుకోవాలని సూచించారు. ప్రతి రోజు పోలింగ్ కేంద్రం వద్ద పరిశీలన చేసి ఎన్నికల వరకు జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు.

ఐదేళ్లలో ఎంతో అభివృద్ధి



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న గ్రామ సచివాలయ భవనం, హెల్త్ వెల్‌నెస్ కేంద్రం

- తుండ పంచాయతీలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి, సంక్షేమం
- ప్రతీ గడపకు సంక్షేమ ఫలాలు
- గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పన



జగ్గుదొరవలసలో నిర్మించిన సీసీరోడ్డు



రైతుభరోసా కేంద్రం

సాలూరు రూరల్: ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధే అజెండాగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందించారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. గ్రామ సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థల ఏర్పాటుతో ప్రజలకు సంక్షేమాన్ని చేరువ చేశారు. గతంలో ఎన్నడూ చూడని అభివృద్ధిని ఐదేళ్లలో చేసి చూపించారు. మండలంలోని తుండ పంచాయతీలో 2019–24 మధ్య కోట్లాది రూపాయలతో సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి పనులు చేపట్టారు. గ్రామస్థాయిలోనే ప్రజలకు అన్ని రకాల ప్రభుత్వ సేవలు అందించేందుకు గాను రూ.25 లక్షలతో గ్రామ సచివాలయాన్ని ఏర్పాటుచేశారు. రైతులకు సేవలందించేందుకు రూ.23.96 లక్షలతో రైతుభరోసా కేంద్రం, ఆరోగ్య సేవలందించేందుకు రూ.20.80 లక్షలతో హెల్త్ వెల్‌నెస్ కేంద్రాన్ని నిర్మించారు. పంచాయతీ పరిధిలోని జగ్గుదొరవలసలో రూ.6.40 లక్షలతో సీసీరోడ్డు నిర్మాణంతో పాటు పలు గ్రామాల్లో రూ.15 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టారు. అలాగే పంచాయతీ పరిధిలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ద్వారా రూ.2,16 కోట్లను నేరుగా లబ్ధిదారులకు అందజేశారు. ఏజెన్సీ గ్రామాల్లో ఇంతకాలానికి అభివృద్ధిని చూస్తున్నామని గిరిజనులు అంటున్నారు. పంచాయతీ అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో పాటు డిప్యూటీ సీఎం రాజన్నదొరకు పంచాయతీ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. మరోసారి రాజన్నదొరను గెలిపించుకుని, జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకుంటామని ముక్తకంఠంతో చెపుతున్నారు.

ప్రతీ ఇంటా సంక్షేమ ఫలాలు

తుండ పంచాయతీలో ప్రతీ గడపకు జగనన్న అందించిన సంక్షేమ ఫలాలు అందాయి. ప్రతీ నెల ఒకటో తేదీ ఉదయమే వలంటీర్ల ద్వారా పింఛన్లను ఇంటి వద్దకే పంపించారు. సన్న, చిన్నకారు రైతులకు రైతుభరోసా కింద పెట్టుబడి సాయం అందించడంతో వ్యవసాయం కోసం అప్పులు చేయాల్సిన దుస్థితి తప్పింది. గతంలో వ్యవసాయం కోసం రూ.5ల వడ్డీకి అప్పులు చేసేవాళ్లం. పండిన పంట అమ్మితే వచ్చే డబ్బులు వడ్డీకే సరిపోయేవి కావు. ఆర్థికంగా అవస్థలు పడేవాళ్లం. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. సంక్షేమ పథకాల ద్వారా అందిన డబ్బులను మా అభివృద్ధికి పెట్టుబడిగా వినియోగించుకుంటున్నాం.

– సీదరపు సూకయ్య, సర్పంచ్, తుండ పంచాయతీ

విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న గ్రామస్తులు

బలిజిపేట: పదో తరగతి ఫలితాల్లో మంచి మార్కులు సాధించిన పెదపెంకి ఉన్నత పాఠశాల విద్యార్థులను గ్రామస్తులు మంగళవారం సన్మానించారు. పాఠశాలకు చెందిన టి.అఖిల(579), పి.జ్యోతి(560)లను సత్కరిస్తూ గ్రామానికి చెందిన చప్ప సత్యంనాయుడు ఒక్కొక్కరికీ వెయ్యి రూపాయలు చొప్పున అందజేశారు. ఉన్నత చదువులు అభ్యసించి గ్రామానికి మంచి పేరుతీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్ పాపారావు, ఈర్ల సంజీవనాయుడు, ఎం.వ్యాస్, ఎం.శ్రీను, బి.లక్ష్మణ్, గ్రామ యువకులు పాల్గొన్నారు.

మక్కువ: పదో తరగతి ఫలితాల్లో మండలంలోని ఎర్రసామంతవలస గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. పాఠశాల నుంచి 44 మంది పరీక్షలకు హాజరుకాగా 43 మంది ఉత్తీర్ణులయ్యారు. వీరిలో పది మందికి పైగా విద్యార్థులు 500లకు పైగా మార్కులు సాధించారు. విద్యార్థులను హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మక్కువ: పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన ఆదర్శ పాఠశాల విద్యార్థిని జులైకబేగం(582), స్థానిక జెడ్పీహెచ్ఎస్ విద్యార్థిని పూజిత(579)ను యూటీఎఫ్ మండల శాఖ, ఎంఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈఓలు పెంట సత్యనారాయణ, డి.శ్యామసుందరరావు, జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం హేమలత, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎస్.స్వర్ణలత పాల్గొని విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులను అభినందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న విద్యార్థులు కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా సత్తా చాటారని అన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.మధుసూదనరావు, మండల శాఖ అధ్యక్షుడు ఎం.రాజేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి శివప్రసాదు, గౌరవ అధ్యక్షుడు పి.శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి ఎం.శంకరరావు, మహిళా సహాధ్యక్షురాలు సంతోషికుమారి, మండల నాయకులు జి.పోలినాయుడు, బి.రమేష్, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను సత్కరిస్తున్న ఎంఈఓ సత్యనారాయణ, యూటీఎఫ్ నాయకులు

గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ జగన్నాథరావు

సాలూరు: గర్భిణులు, బాలింతల ఆరోగ్య వివరాలను ఆన్‌లైన్ పోర్టల్‌లో తప్పకుండా నమోదు చేయాలని డీఎంహెచ్ఓ డాక్టర్ బి.జగన్నాథరావు ఆదేశించారు. సాలూరు, పాచిపెంట, మక్కువ మండలాల పీహెచ్‌సీ వైద్యాధికారులు, సిబ్బందితో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో అందిస్తున్న ఆరోగ్య సేవలపై ఆరాతీశారు. గర్భిణులకు క్రమం తప్పకుండా వైద్య సేవలందించాలని సూచించారు. గర్భిణుల వివరాలను మొదటి మూడు నెలల్లోనే నమోదు చేయాలని, తద్వారా వారికి మెరుగైన వైద్య సేవలందించేందుకు వీలుంటుందన్నారు. పీహెచ్‌సీలో ప్రసవాల సంఖ్య పెరిగేలా చూడాలని, కాన్పు తరువాత మాతా, శిశు ఆరోగ్యంపై ప్రత్యేక పర్యవేక్షణ చేయాలని సూచించారు. వేసవి దృష్ట్యా డీహైడ్రేషన్‌కు గురికాకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో డీఐఓ నారాయణరావు, డిప్యూటీ డీఎంహెచ్ఓ శివకుమార్, డీఎంఓ జగన్మోహనరావు, ఆర్బీఎస్‌కే ప్రోగ్రాం అధికారి డా.రఘుకుమార్, ఎఫ్‌డీసీ ప్రోగ్రాం అధికారి డా.వినోద్, ఎపిడిమాలజిస్ట్ శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

89 మందికి వైద్య సేవలు

పార్వతీపురంటౌన్: ప్రతీ గ్రామంలో నెలకు రెండు సార్లు 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమం ద్వారా వైద్య సేవలు అందిస్తున్నామని డాక్టర్ ఐశ్వర్య అన్నారు. మండలంలోని సూడిగాం గ్రామంలో మంగళవారం 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 89 మందికి వైద్య పరీక్షలు చేసి అవసరమైన మందులు అందజేశారు. అనంతరం గ్రామంలో పర్యటించి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులు, గర్భిణులు, బాలింతలకు వైద్య సేవలందించారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా 13 రకాల వైద్య సేవలు, 14 రకాల వైద్య పరీక్షలు, 67 రకాల మందులు అందజేస్తున్నామని వివరించారు. వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అతివల ఆర్థిక స్వావలంబనకు 'ఆసరా'

- డ్వాక్రా సంఘాల రుణాలు మాఫీ చేసిన జగనన్న
- గతంలో రుణ మాఫీ చేయకుండా మహిళలను మోసం చేసిన చంద్రబాబు
- నిన్ను నమ్మం బాబు అంటున్న మహిళా లోకం



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మహిళలు(ఫైల్)

సాలూరు:

ఇంటికి వెలుగు ఇల్లాలు అంటారు. కుటుంబ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచడంలో మహిళల పాత్ర చాలా కీలకం. ఎంతో మంది పేద, మధ్య తరగతి మహిళలు డ్వాక్రా సంఘాల్లో చేరి ప్రభుత్వం అందించిన రుణాలను సద్వినియోగం చేసుకుంటూ కుటుంబన్ని ఆర్థికంగా బలోపేతం చేసుకుంటున్నారు. 2014 ఎన్నికల సమయంలో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు అధికారంలోకి వస్తే డ్వాక్రా సంఘాలు తీసుకున్న రుణాలను మాఫీ చేస్తామని, మహిళల ఆర్థికంగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక హామీలు అమలు చేయకుండా మహిళలను మోసం చేశారు. తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించలేక, వడ్డీలు కట్టలేక మహిళలు ఎన్నో ఇబ్బందులు పడ్డారు. తన సుదీర్ఘ పాదయాత్రలో నాటి ప్రతిపక్ష నాయకుడు, ప్రస్తుత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి చంద్రబాబు చేసిన మోసాన్ని మహిళలు వివరించారు. అధైర్య పడొద్దని, అధికారంలోకి వచ్చిన వెంటనే డ్వాక్రా సంఘాల రుణాలు మాఫీ చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా డ్వాక్రా సంఘాల రుణాలను విడతల వారీగా చెల్లించారు. మహిళల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి వారి ఆర్థిక స్వావలంభనకు కృషిచేశారు. చంద్రబాబు తమను మోసం చేస్తే.. జగనన్న అండగా నిలబడ్డారని, ఆర్థికంగా ఆదుకున్నారని మహిళలంతా అంటున్నారు. జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకునేందుకు మహిళా లోకం సిద్ధమయ్యింది.

మున్సిపాలిటీలో సుమారు రూ.20 కోట్లు మాఫీ

మున్సిపాలిటీలో మెప్మా ఆధ్వర్యంలో 875 మహిళా సంఘాలలో సుమారు 8,939 మంది లబ్ధిదారులు ఉన్నారు. వారికి వైఎస్సార్ ఆసరా పథకం కింద ప్రతీ విడతలో సుమారు రూ.5 కోట్లకు పైగా నిధుల మంజూరు చేశారు. ఇలా నాలుగు విడతల్లో సుమారు రూ.20 కోట్ల వరకు రుణమాఫీ చేశారు.

మాకు మంచి చేసింది జగనన్నే..



డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తానని చెప్పి చేయకుండా చంద్రబాబు మోసం చేశారు. జగనన్న అధికారంలోకి వచ్చాక ఇచ్చిన మాట ప్రకారం వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా నాలుగు విడతల్లో డ్వాక్రా రుణమాఫీ చేశారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు అనేక పథకాలు, కార్యక్రమాలు అమలు చేశారు. ఇంటి పెద్దకొడుకుగా, ఓ సోదరుడిగా మాకు అండగా నిలిచారు.జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మేలు మరువలేం.

– అల్లు అక్కమ్మ, వరలక్ష్మి పొదుపు సంఘం సభ్యురాలు, సాలూరు మున్సిపాలిటీ

నిస్వార్థ నాయకుడు రాజన్నదొర



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ రెడ్డి పద్మజ

సాలూరు రూరల్: ప్రజలకు నిస్వార్థ సేవలందించే నాయకుడు రాజన్నదొర అని, కోట్లాది రూపాయలతో నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టారని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ రెడ్డి పద్మజ అన్నారు. మండలంలోని కొత్తవలస పంచాయతీ దాగరవలస, గుంద్రప్పవలస, గొందివలస గ్రామాల్లో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమం, అభివృద్ధిని వివరించారు. ప్రస్తుతం అందుతున్న పథకాలు కొనసాగాలంటే జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని అన్నారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి రాజన్నదొరను ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ నెమలిపిట్ట పద్మావతి, మాజీ సర్పంచ్ బొన్నాడ సీతారాం, స్థానిక నాయకులు జయసింహ, కళ్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన సాలూరు నేతలు





ఎన్నికల ప్రచారంలో భాగంగా మేమంతా సిద్ధం సభలో పాల్గొనేందుకు వచ్చిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని విశాఖపట్నంలో డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, వైఎస్సార్‌సీపీ సాలూరు నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు వి.శ్రీనివాసరెడ్డి, మక్కువ జెడ్పీటీసీ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ బొబ్బిలి అసెంబ్లీ ఎన్నికల పరిశీలకుడు మావుడి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మక్కువ మండలాధ్యక్షుడు మావుడి రంగునాయుడు మర్యాదపూర్వకంగా కలిశారు. – మక్కువ

వైఎస్సార్‌సీపీలోకి వలసల వెల్లువ



వైఎస్సార్‌సీపీలో చేరిన రావికోన గ్రామస్తులతో ఎమ్మెల్యే జోగారావు (ఫైల్)

- టీడీపీ, జనసేన, బీజేపీ నుంచి భారీగా తరలివస్తున్న కార్యకర్తలు
- నెల రోజుల్లో సుమారు 3 వేల మంది చేరిక

పార్వతీపురంటౌన్: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు కళ్లకు కట్టినట్లు స్పష్టంగా కనిపిస్తున్నాయి. గ్రామ సచివాలయ వ్యవస్థతో సంక్షేమ పాలనను ప్రజలకు చేరువ చేశారు. అవినీతికి తావులేకుండా పారదర్శక పాలన అందించారు. గాంధీజీ కలలుకన్న గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేసేలా సుపరిపాలన అందించారు. నాడు–నేడు కార్యక్రమంలో విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. వలంటీర్ల ద్వారా ప్రభుత్వ సేవలను ఇంటి వద్దకే చేరవేశారు. ఇలా చెప్పుకుంటూపోతే సీఎం జగన్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమం కోకొల్లలు. 2014–19 మధ్య అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం అమలు చేసిన పథకాలు, అభివృద్ధి చెప్పుకోడానికి ఒక్కటి కూడా లేదు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గెలుపు తథ్యమని, వైఎస్సార్‌సీపీతోనే రాష్ట్రం, నియోజకవర్గం అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని, టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి గతంలో ప్రజలకు చేసిన మంచి ఏమీ లేదని గ్రహించిన కూటమి నేతలు మూకుమ్మడిగా వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారు. గత నెల రోజుల వ్యవధిలో పార్వతీపురం నియోజకవర్గంలో సుమారు 3 వేల మందికిపైగా టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఇంకా వలసలు కొనసాగుతునే ఉన్నాయి.

వైఎస్సార్‌సీపీలో చేరికలు కొన్ని..

- గత నెల 5న పార్వతీపురం పురపాలక సంఘం పరిధిలో టీడీపీ మాజీ కౌన్సిలర్ మజ్జి శంకరరావుతో పాటు 30 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి.
- గత నెల 10న టీడీపీ నాయకుడు పోల సత్యనారాయణ(పీఎస్ఎన్) వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు.
- సీతానగరం మండలం రంగంపేటలో 70 కుటుంబాలు, పార్వతీపురం మండలం పెదబొండపల్లి గ్రామంలో 30 మంది జనసైనికులు 'ఫ్యాన్' నీడకు చేరారు.
- గత నెల 23న పార్వతీపురం పట్టణం జగన్నాథపురానికి చెందిన 100 మంది టీడీపీ, జనసేన కార్యకర్తలు వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పుకున్నారు.
- గత నెల 28న పార్వతీపురం మండలం వెంకంపేట గ్రామానికి చెందిన 70 టీడీపీ కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి.
- గత నెల 31న శంకా వీధిలో నిర్వహించిన మేమంతా సిద్ధం కార్యక్రమంలో ఎమ్మెల్యే జోగారావు ఆధ్వర్యంలో 20 మంది జనసైనికులు వైఎస్సార్‌సీపీలో చేరారు.
- ఈనెల 2న సీతానగరం మండలం బక్కుపేటకు చెందిన 70 టీడీపీ కుటుంబాలు వైఎస్సార్‌సీపీలోకి వలస వచ్చాయి.
- ఈనెల 9న బలిజిపేట మండలం సుభద్ర గ్రామానికి చెందిన 50 కుటుంబాలు, సీతానగరం మండలం లక్ష్మీపురం, అంటిపేట, ఏగోటివలస గ్రామాలకు చెందిన 200 కుటుంబాలు 'ఫ్యాన్' పక్కకు చేరాయి.
- ఈనెల 11న పార్వతీపురం మండలం నర్సిపురం గ్రామానికి చెందిన టీడీపీ మాజీ ఎంపీటీసీ 80 కుటుంబాలకు చెందిన అనుచరులతో కలిసి వైఎస్సార్‌సీపీ కండువాలు వేసుకున్నారు.
- ఈ నెల 12న పార్వతీపురం మండలం రావికోన పంచాయతీకి చెందిన 130 గిరిజన కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి.
- ఈనెల 18న పార్వతీపురం మండలం నర్సిపురం గ్రామానికి చెందిన 40 మంది యువత, సంగంవలస గ్రామానికి చెందిన 30 మంది యువత వైఎస్సార్‌సీపీలో చేరారు.

అభివృద్ధి, సంక్షేమ పాలన మెచ్చి

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధి పనులు, అందించిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్వతీపురం నియోజకవర్గంలో కూటమి నేతలు వైఎస్సార్‌సీపీలో భారీగా చేరుతున్నారు. పార్టీలో చేరిన వారందరినీ కోరేది ఒకటే.. మళ్లీ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకొనేందుకు కృషిచేయాలి. అందుకోసం గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలి. నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ వైఎస్సార్‌సీపీతో కలిసి రావాలని కోరుతున్నాం.

– అలజంగి జోగారావు, ఎమ్మెల్యే, పార్వతీపురం